సాక్షి
ఒడిశా
శనివారం ၊ 21 ၊ సెప్టెంబర్ ၊ 2024


శ్రీమందిరం ఆదాయం లెక్కింపు
నగదు రూ.3,71,993
- భువనేశ్వర్/పూరీ


మావో డంప్ స్వాధీనం - 8లో
మల్కన్‌గిరి జిల్లాలోని కలిమెల సమితి బెజాంగ్ వాడ పంచాయతీ గంపకొండ కెనాల్ దిగువ భాగంలో బీఎస్ఎఫ్ జవాన్లు మావోయిస్టులు అమర్చిన డంప్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.


విజిలెన్స్ దాడులు - 8లో
బాలాసోర్ గ్రామీణ నిర్మాణ శాఖ చీఫ్ ఇంజినీర్ ఎస్.వి.హరిహరరావు ఇంటిపై శుక్రవారం విజిలెన్సు దాడులు చేపట్టారు.

న్యూస్‌రీల్

'సీఎం మోహన్ రాజీనామా చేయాలి'


మాట్లాడుతున్న మాజీ ఎంపీలు రమేష్, ప్రదీప్ తదితరులు

జయపురం: నవరంపూర్ జిల్లా తెంతులికుంటి సమితి కొంటాగాం గ్రామంలో మైనర్ బాలికపై అత్యాచారం, హత్య ఘటనకు బాధ్యత వహించి సీఎం మోహన్ చరణ్ మాఝి రాజీనామా చేయాలని జిల్లా బీజేడీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నవరంగపూర్‌లో విలేకరుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. మాజీ ఎంపీ ప్రదీప్ మాఝి మాట్లాడుతూ.. దోషులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, అందువలన హోం శాఖను నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రాజీనామా చేయాలన్నారు. 4, 5 రోజుల్లో నిందితులను పోలీసులు అరెస్టు చేయకపోతే జిల్లా బంద్ చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో మాజీ ఎంపీ రమేష్ చంద్ర మాఝి తదితరులు పాల్గొన్నారు.

స్వగ్రామానికి సీఎం మోహన్‌చరణ్


సీఎం మోహన్‌కు స్వాగతం పలుకుతున్న దృశ్యం

భువనేశ్వర్: రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి సొంత జిల్లా పర్యటన శుక్రవారం నుంచి ఆరంభమైంది. 3 రోజుల పాటు ఆయన ఈ ప్రాంతంలో పలు చోట్ల పర్యటిస్తారు. వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా స్థానికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. లైఫ్ సేవర్స్ గ్రూపు ట్రస్టు మూడో వార్షికోత్సవంలో ముఖ్యమంత్రి పాల్గొని స్వగ్రామం రయికిలా సొంత ఇంటికి చేరారు. అనంతరం స్థానిక హోటల్‌లో జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. శనివారం విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రజతోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొంటారు. సాయంత్రం పార్టీ కార్యకర్తలతో సమావేశమవుతారు. ఆదివారం డీడీ విశ్వ విద్యాలయం ప్రాంగణంలో రాష్ట్రంలో 100 రోజుల పాలన విజయోత్సవంలో పాల్గొంటారు. ఈ సందర్భంగా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు.

అధిక సంతానంతో అధ్యక్ష పదవి రద్దు



బాసంతి సాహు

భువనేశ్వర్: అధిక సంతానం ఆరోపణ కింద మండల అధ్యక్ష పదవి కోల్పోవాల్సి వచ్చింది. పూరీ జిల్లా డెలాంగ్ మండలం అధ్యక్షురాలు బాసంతి సాహుని ఈ ఆరోపణ కింద పదవి నుంచి తొలగిపోవాలని న్యాయస్థానం ఆదేశించింది. స్థానిక ఎన్నికల ట్రిబ్యునల్‌లో ఆమె ప్రత్యర్థి దాఖలు చేసిన కేసు విచారణ పురస్కరించుకుని న్యాయస్థానం ఈ మేరకు తీర్మానించింది. బాసంతి సాహు హరిరాజ్‌పూర్ సమితి సభ్యురాలిగా ఎన్నికయ్యారు. అనంతరం మండల అధ్యక్షురాలిగా ఎన్నికై పాలన పగ్గాలు చేపట్టింది. ఈ నేపథ్యంలో హరిరాజ్‌పూర్ సమితి సభ్యత్వం కూడ రద్దు చేసినట్లు న్యాయస్థానం స్పష్టం చేసింది. పంచాయతీ ఎన్నికల నిబంధనల ప్రకారం 2 మంది పిల్లలు కంటే అధిక సంతానం కలిగి ఉంటే అనర్హులుగా ప్రకటిస్తారు. బాసంతి సాహుకు ముగ్గురు సంతానంగా పేర్కొని ప్రత్యర్థి కేసు దాఖలు చేయడంతో పదవి కోల్పోవడం అనివార్యమైంది.

తెలుగు రాష్ట్రాలకు రాతెస సాయం

భువనేశ్వర్: అవిభాజిత ఆంధ్రప్రదేశ్ ప్రజలకు రాష్ట్రేతర తెలుగు సమాఖ్య (రాతెస) ఆర్థిక సాయం అందజేసింది. ఇటీవల వరదలతో అతలాకుతలమైన ఈ ప్రాంతాల ప్రజల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధి పేరిట చెక్‌లను అందజేసినట్లు అధ్యక్షుడు రాళ్లపల్లి సుందరరావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రుల సహాయనిధికి రూ. 57,000 చొప్పున రెండు వేర్వేరు చెక్‌లను అందజేసినట్లు తెలిపారు. ఇది రాష్ట్రేతర ప్రాంతాల్లో స్థిరపడిన తెలుగు వారి సహృదయ స్పందనకు తార్కాణంగా పేర్కొన్నారు.

రక్షకులే.. రాక్షసులై..!



- భరత్‌పూర్ ఠాణా ఘటనలో విస్తుపోయే అంశాలు
- మీడియాతో మాట్లాడిన బాధితురాలు
- తనపై విచక్షణారహితంగా దాడి చేశారని ఆవేదన
- పోలీసుల తీరుపై సర్వత్రా విమర్శలు
- కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్

భువనేశ్వర్: స్థానిక భరత్‌పూర్ పోలీసుస్టేషన్‌లో ఆర్మీ మేజర్ గురువంత్ సింగ్, అతని స్నేహితురాలిపై పోలీసుల అమానుష దాడి వాస్తవ వివరాలు క్రమంగా బయటపడుతున్నాయి. బాధిత యువతి ఆరోగ్యం క్రమంగా కోలుకోవడంతో ఈ వివరాలు బహిరంగంగా తెలియజేసింది. గద్గద స్వరంతో ఆమె ఎదుర్కొన్న పోలీసుల దాడి కథనం పోలీసుల క్రూరత్వాన్ని బహిర్గతం చేస్తోంది. ఇంతకుముందు స్థానిక కమిషనరేట్ పోలీసులు తెలిపిన వివరాలు కట్టు కథలని తేలిపోతున్నాయి. రాష్ట్రంలో సగటు మహిళకు కనీస రక్షణ, భద్రత లేదనే భయాందోళనలు కలవరపరుస్తున్నాయి.

పోలీసుల క్రూరత్వం

భరత్‌పూర్ ఠాణాలో పోలీసులు తమపై అత్యంత క్రూరంగా ప్రవర్తించి వేధించారని బాధిత యువతి తెలిపింది. నడి రోడ్డుమీద సంఘటన పురస్కరించుకుని ఫిర్యాదు రాసేందుకు అనుమతించిన పోలీసులు, కాసేపటిలోనే మేజర్ గురువంత్ సింగ్‌ని లాకప్‌లో పడేశారని వాపోయింది. ఒక సైనికాధికారిపై ఇటువంటి చర్య ఎంతమాత్రం తగదని అభ్యర్థించిన తనపై విజృంభించారని తెలిపింది. ఇద్దరు మహిళ పోలీసు అధికారులు జుట్టు పట్టుకుని తనకు ఈడ్చి కొట్టారని ఆవేదన వ్యక్తం చేసింది. ఠాణా వరండాపైకి ఈడ్చుకుని వచ్చి పీక నులిమేందుకు ప్రయత్నించబోగా చేతికి కాటేసి తప్పించుకున్నట్లు వివరించారు. మరో మహిళా పోలీసు అధికారి చొరవ కల్పించుకుని రెండు చేతులు వెనకకు వంచి కట్టేయడంతో పాటు కాళ్లు కూడ కట్టేసి ఒక గదిలోకి నెట్టేశారన్నారు. ఇంతలో మరో పురుష పోలీసు అధికారి ఆ గదిలోకి ప్రవేశించి తన లోదుస్తులు తొలగించి ఛాతీపై తీవ్రంగా తొక్కినట్లు తెలిపారు. ఆ తర్వాత ఠాణా ఇన్‌స్పెక్టర్ ఇన్‌చార్జి రంగంలోకి దిగి ప్యాంటు తొలగించి చెప్పుకోలేని రీతిలో అమానుష చర్యలకు పాల్పడ్డారని మీడియా ముందు రోదిస్తూ ఠాణాలో అమానుష చర్యని శుక్రవారం వివరించింది.


బాధితురాలిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఫిరదౌసి

హైకోర్టు చొరవ చూపాలి

ఇంతటి అమానుష సంఘటనపై న్యాయసమ్మతమైన చర్యలు చేపట్టేందుకు ఒడిశా పోలీసులు వెనుకంజ వేయడంపై భారత సైనిక సిబ్బంది వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఈ దుశ్చర్యపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం స్వయంగా చొరవ కల్పించుకుని చట్టపరమైన చర్యలకు ఆదేశించాలని సైనిక అధికారి వర్గాలు రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాసి అభ్యర్థించారు. సైన్యాధికారి, అతనితో ఉన్న మహిళపై ఠాణాలో పోలీసుల వ్యవహార శైలిపై రాష్ట్ర ప్రభుత్వం శాఖాపరమైన చర్యలను చేపడుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి శుక్రవారం ప్రకటించారు.

మహిళా కమిషన్ చొరవ



ఠాణాలో పోలీసుల వైఖరిపై విచారణ చేపట్టేందుకు స్వయంగా చొరవ కల్పించుకున్నట్లు రాష్ట్ర మహిళా కమిషన్ అధ్యక్షురాలు మీనతి బెహరా తెలిపారు. విచారణ జరిపేందుకు ఆమె భరత్‌పూర్ పోలీసు ఠాణా ప్రత్యక్షంగా సందర్శించి ఠాణా వర్గాలతో చర్చించారు. ఠాణాలో అందుబాటులో ఉన్న కేసు సంబంధిత కాగిత పత్రాలు స్వాధీనపరచుకున్నారు. క్రైం శాఖ దర్యాప్తు ఆరంభం కావడంతో కీలక కాగిత పత్రాలు ఠాణాలో అందుబాటులో లేనట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో క్రైం శాఖ కార్యాలయం సందర్శించి అవసరమైన సమాచారంతో అనుబంధ కాగితపత్రాలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం బాధిత వర్గాలతో సంప్రదించడం జరుగుతుందన్నారు.

క్రైం శాఖ దర్యాప్తు కొనసాగుతుందన్నారు.

మీడియాకు దూరంగా

ఈ సంఘటనపై స్పందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మీడియాకు దూరంగా ఉంటోంది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మహిళ – శిశు అభివృద్ధి శాఖ మంత్రి ప్రభాతి పరిడా బాధితురాలిని ఆస్పత్రిలో పరామర్శించి నగర డీసీపీతో సంప్రదించినట్లు సమాచారం. ఈ మేరకు మీడియాతో స్పందించేందుకు ఆమె నిరాకరించారు.

కానరాని సీసీటీవీ కెమెరా

బాధిత మహిళని కటక్ బరాబటి నియోజకవర్గం ఎమ్మెల్యే సోఫియా ఫిరదౌసి పరామర్శించారు. ఘటనా పూర్వాపరాలను ఆమెతో చర్చించారు. భరత్‌పూర్ పోలీసు ఠాణా ఆదర్శ పోలీసు ఠాణాగా ఏర్పాటైంది. ఆదర్శ ఠాణా మార్గదర్శకాల ప్రకారం ఈ ప్రాంగణంలో సీసీటీవీ కెమెరా ఏర్పాటు అయింది. అయితే ప్రస్తుతం ఇది కనిపించడం ఆమె ఆరోపించారు. ఈ ఠాణా ఇటీవల ఈ భవనానికి తరలించడంతో సీసీటీవీ కెమెరా అమరిక జరగనట్లు రాష్ట్ర మహిళా కమిషన్ అధ్యక్షురాలు మీనతి బెహెరా మీడియాకు సర్ది చెప్పారు.

న్యాయ విచారణ జరగాలి: నవీన్ పట్నాయక్



ఈ సంఘటనపై న్యాయ విచారణ జరిపించాలని విపక్ష నేత నవీన్ పట్నాయక్ డిమాండ్ చేశారు. ఠాణాలో మహిళపై లైంగిక వేధింపులు అత్యంత శోచనీయమని ఆయన మీడియా సమావేశంలో వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో శాంతి భద్రతల వ్యవస్థ కుప్పకూలిపోయిందని ధ్వజమెత్తారు. ఠాణాలు, ఆస్పత్రుల్లో సాధారణ ప్రజానీకం ఎదుర్కొంటున్న వాస్తవ పరిస్థితులను తక్షణమే తెలుసుకునేందుకు తమ ప్రభుత్వం మో సర్కారు వ్యవస్థని ప్రవేశపెట్టిందని గుర్తు చేశారు. అయితే దీనిని కొత్త ప్రభుత్వం అకారణంగా తొలగించిందని ధ్వజమెత్తారు. సమాజంలో సగటు మనిషికి రేయింబవళ్లు రక్షణ, భద్రత కల్పించడం ప్రభుత్వం ప్రాథమిక కర్తవ్యం కావాలన్నారు.

దసరా వేడుకలకు సన్నాహక సమావేశం


సన్నాహక సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

జయపురం: పట్టణంలో దసరా వేడుకలు నిర్వహించేందుకు స్థానిక మున్సిపల్ సభాగృహంలో జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అధ్యక్షతన సమావేశం శుక్రవారం జరిగింది. ఈనెల 23వ తేదీన మూల అష్టమి రోజున అంచమాల కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని దేవదాయ ధర్మాదాయ అధికారి జయపురం తహసీల్దార్ సవ్యసాచి పండ వెల్లడించారు. జయపురం రాజుల కాలం నుంచి అనాదిగా వస్తున్న సాంప్రదాయం ప్రకారం అమ్మవారు అక్టోబర్ 3వ తేదీ నుంచి నగర సంచారం చేస్తుందని వెల్లడించారు. అక్టోబర్ 8వ తేదీ నుంచి పట్టణంలో ఏర్పాటు చేయబడిన వివిధ పూజా మండపాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. జయపురం దసరా ఉత్సవాల్లో అవిభక్త కొరాపుట్‌లోని వివిధ గ్రామాల నుంచి గ్రామ దేవతల లాఠీలను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. 12వ తేదీన దసరా రోజు అతి పెద్ద ఊరేగింపు సర్దార్ పటేల్ మార్గం నుంచి దసరా పాడియ వరకు నిర్వహించబడుతుందన్నారు. అక్కడ అపరాజిల పూజలు నిర్వహించి రావణ దహనం జరుగుతుందని వెల్లడించారు. సమావేశంలో సబ్ కలెక్టర్ ఎ.శశ్యా రెడ్డి, మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయిక్, బీడీవో శక్తి మహాపాత్రో, చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి, వైస్ చైర్మన్ బి.సునీత, సమాచార ప్రజా సంబంధాల అధికారి యశోద గదబ, సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి, పట్టణ పోలీసు అధికారి రమణీ రంజన్ దొళాయి తదితరులు పాల్గొన్నారు.

నదిలో మునిగి మహిళ మృతి

జయపురం: నది వద్ద స్నానం చేసేందుకు వెళ్లిన మహిళ ప్రమాదవశాత్తు మునిగి మరణించిన ఘటన బొరిగుమ్మ సమితి పండసగుడ గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి సమీపంలోని నది వద్ద స్నానం చేసేందుకు నబిత జానీ(40) గురువారం ఉదయం వెళ్లింది. అయితే అక్కడ ప్రమాదవశాత్తు కాలుజారి నదిలో పడిపోయింది. నది లోతుగా ఉండడంతో ఆమె గల్లంతయ్యింది. శుక్రవారం మృతదేహం నవరంగపూర్ జిల్లా బందరీగుడ సమీప చింగునీగుడ నది ఒడ్డున తేలడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు వచ్చి స్థానికుల సహకారంతో మృతదేహాన్ని బయటకు తీశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


చెక్కులు అందజేస్తున్న మంత్రి నిత్యానంద

జయపురం: ప్రజా సంక్షేమమే బీజేపీ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నిత్యానంద గోండ్ అన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టి 100 రోజులు పూర్తయిన సందర్భంగా నవరంగ్‌పూర్‌లోని నూతన మండపంలో వికాస మేళ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు 100 రోజుల్లో అమలు చేశామన్నారు. అనంతరం వివిధ పథకాల లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో నవరంగపూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర మాఝి, కలెక్టర్ డాక్టర్ శుభంకర మహాపాత్రో తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్‌లోగా ఆధునికీకరణ పనులు


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న జీఎం పరమేశ్వర్ ఫంక్వాల్ తదితరులు

- ఈస్టుకోస్టు రైల్వే జీఎం పరమేశ్వర్ ఫంక్వాల్

పర్లాకిమిడి: గుణుపురం, పర్లాకిమిడి రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ పనులు డిసెంబర్‌లోగా పూర్తి చేయడానికి లక్ష్యం పెట్టుకున్నామని ఈస్టుకోస్టు రైల్వే జీఎం పరమేశ్వర్ ఫంక్వాల్ అన్నారు. నౌపడా, పర్లాకిమిడి, గుణుపురం రైల్వేస్టేషన్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించడానికి వాల్తేరు డివిజన్ విశాఖపట్నం డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్‌తో కలిసి శుక్రవారం ఆయన పర్లాకిమిడి విచ్చేశారు. ఈ సందర్భంగా జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. గుణుపురం – తురువలి రైల్వేలైన్ ఎక్స్‌టెన్షన్ పనులకు భూసేకరణ అడ్డు వస్తోందని, రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి త్వరలో పనులకు టెండర్లు పిలుస్తామని ఒక ప్రశ్నకు సమాధానంగా తెలియజేశారు. నౌపడా నుంచి గుణుపురం వరకు అదనపు క్రాసింగ్ స్టేషన్లు ప్రస్తుతం నిర్మించాల్సి ఉందని, అలాగే గుణుపురం నుంచి హైదరాబాద్‌కు ఎక్స్‌ప్రెస్ ట్రైన్లు ఇప్పట్లో ఉండే అవకాశం లేదని స్పష్టం చేశారు. అనంతరం గజపతి సురక్షా మంచ్ ఆధ్వర్యంలో ఒక వినతిపత్రాన్ని రైల్వే జీఎంకు బసంతపండా అందజేశారు. పర్లాకిమిడిలో ప్లాట్‌ఫారం వన్ పనులు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు కూడా త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. వారితో పాటు ఈస్టుకోస్టు రైల్వే చీఫ్ ఇంజినీర్ రాజ్‌కుమార్ ఇతర అధికారులు ఉన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న పరమేశ్వర్ ఫంక్వాల్

అభివృద్ధి వైపునకు అడుగులు

- ఎన్నికల హామీలను నెరవేరుస్తున్నాం
- మంత్రి ఖుంటియా వెల్లడి
- రాయగడలో వికాస్ మేళా


మహిళలకు చెక్కులు అందజేస్తున్న మంత్రి ఖుంటియా తదితరులు

రాయగడ: రాష్ట్రం అభివృద్ధి వైపు వడివడిగా అడుగుల వేస్తోందని రాష్ట్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి గణేష్ రామ్ సింహ్ ఖుంటియా అన్నారు. స్థానిక రైల్వే గ్రౌండ్‌లో 100 రోజుల బీజేపీ పాలన పూర్తయిన సందర్భంగా జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన వికాస్ మేళా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఏర్పాటు చేసిన అభివృద్ధి స్టాల్స్‌ను ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా బీజేపీ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రజల ఆర్థిక, సామాజిక రంగాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు తెలియజేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒకొక్కటిగా నెరవేరుస్తున్నామని పేర్కొన్నారు. 100 రోజుల పాలనలో పూరీ పుణ్యక్షేత్రం శ్రీజగన్నాథ మందిరంలో నాలుగు ద్వారాల తెరిచినట్లు చెప్పారు. అదేవిధంగా సుభద్ర యోజన పథకానికి శ్రీకారం చుట్టి మహిళల ఆర్థిక సాధికారతకు తమ వంతు సహకారాన్ని అందిస్తుందన్నారు. ఈ పథకం వల్ల ప్రతీ ఏడాదికి సుమారు రూ.55 వేల కోట్లు సమకూర్చినట్లు వివరించారు.

వ్యవసాయంలో కొత్త పుంతలు

రాష్ట్రం ఆర్థిక రంగంలో పురోగతి చెందాలంటే అందుకు వ్యవసాయ రంగం కొత్త మలుపులు తిరిగేలా బీజేపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. రైతే రాజు అనే మాటను నిజం చేస్తూ పలు పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని వివరించారు. ఇప్పటికే ధాన్యం మద్దతు ధర క్వింటాల్‌కు రూ.3,200లకు ప్రకటించిన ప్రభుత్వం, అందుకు అనుగుణంగా కట్టుబడి ఉందన్నారు. ఈ ఏడాది రాష్ట్రంలో సుమారు లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం ఖరీదు చేసేందుకు ప్రణాళికను రూపొందిస్తోందని పేర్కొన్నారు.

వలసలకు అడ్డుకట్ట వేస్తాం

ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు జరుగుతున్న వలసలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని మంత్రి ఖుంటియా తెలిపారు. నిరుద్యోగ సమస్యను నివారించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ ఏడాది సుమారు 2.5 లక్షల మంది నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తొలగిస్తామని హామీ ఇచ్చారు.

420 ఆదర్శ గ్రామాల గుర్తింపు

జిల్లాలోని మొత్తం 2,656 గ్రామాల్లో 420 అదర్శ గ్రామాలను గుర్తించామని కలెక్టర్ ఫరూల్ పట్వారి తెలియజేశారు. ఆదివాసీ, హరిజనులు, వెనుకబడిన ప్రజలు నివసిస్తున్న 420 గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా గుర్తించి, అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. డొంగిరియా, లంజియా సవర తెగలకు చెందిన ఆదివాసీలు నివసిస్తున్న ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. వారికి మౌలిక సౌకర్యాలు కల్పించడానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ చేరేలా జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని పేర్కొన్నారు. అనంతరం సుభద్ర యోజన పథకంలో భాగంగా మొదటి విడత కింద రూ.5 వేల చెక్కులను మంత్రి మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహక అధికారి లలిత్ కుమార్ కుహరో, ఏడీఎం భాస్కరరైతా, సబ్ కలెక్టర్ (రాయగడ) కల్యాణి సంఘమిత్రా దేవి, సబ్ కలెక్టర్ (గుణుపూర్) కిరణ్ దీప్ కౌర్ సహోటే తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మంత్రి ఖుంటియాకు ఘన స్వాగతం



మంత్రి ఖుంటియాకు స్వాగతం పలుకుతున్న నాయకులు

రాయగడ: రాయగడ పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి గణేష్ రామ్ సింహ ఖుంటియాకు బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బసంత కుమార్ ఉలక, ఎస్సీ, ఎస్టీ సెల్ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు కాళీరాం మాఝి, ఎల్ల కొండబాబు తదితరులు మంత్రికి స్వాగతం పలికారు. ఆయన ముందుగా మజ్జిగౌరి అమ్మవారిని దర్శించుకొని, అనంతరం సిరిగుడలోని బీజేపీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశమయ్యారు.

గుణుపూర్‌లో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ కళాశాలలో శుక్రవారం రక్తదాన శిబిరం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆదర్శ పోలీస్‌స్టేషన్ ఐఐసీ ఉత్తమ్ కుమార్ సాహు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత రక్తదానంపై ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల నిర్వాహక కమిటీ అధ్యక్షుడు మోహన్ చంద్ర సాహు తదితరులు పాల్గొన్నారు. శిబిరంలో 91 యూనిట్ల రక్తాన్ని సేకరించారు.

పౌష్టికాహార మాసోత్సవాలు



పాలియలో పౌష్టికాహారం ప్రదర్శిస్తున్న దృశ్యం

జయపురం: నవరంగపూర్ జిల్లా జోరిగాం సమితి పుప్పుగాం, పాలియ గ్రామ పంచాయతీల్లో జాతీయ పౌష్టికాహార మాసోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. శిశువులు, గర్భిణులు, బాలింతల్లో కనిపించే రక్తహీనత నివారణకు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. పెరటి పంటలకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. కార్యక్రమంలో జోరిగాం ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డవలప్‌మెంట్ విభాగం ప్రాజెక్టు అధికారి బిరజ మోహిని పంగి తదితరులు పాల్గొన్నారు.

రక్త నమూనాల సేకరణ



రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య బృందం

రాయగడ: జిల్లాలోని మునిగుడ సమితి సకట గ్రామంలో సికిల్ సెల్ పరీక్షలకు సంబంధించి రక్త నమూనాలను సేకరించారు. గ్రామంలోని 62 మంది రక్త నమూనాలను సేకరించిన వైద్య బృందం వాటిని పరీక్షకు పంపించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మునిగుడ బీడీవో ప్రీతమ్ కుమార్ తండి, డాక్టర్ మమత సతపతి, డాక్టర్ ఎ.గౌరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: స్థానిక నగరపాలక సంస్థ(బీఎంసీ) శుక్రవారం మెగా ఆరోగ్య శిబిరం నిర్వహించింది. స్థానిక ఐసీఓఎంసీ టవర్ ప్రాంగణంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. నగర మేయర్ సులోచన దాస్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. సుమారు 700 మంది ఈ కార్యక్రమంలో పలు ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. త్వరలో మరో 3 జోన్లలో ఇటువంటి ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్లు మేయరు తెలిపారు.

రాయగడ నాయకులతో నవీన్ సమావేశం

భువనేశ్వర్: రాయగడ జిల్లా బిజూ జనతా దళ్ నాయకులతో అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ శుక్రవారం సమావేశమయ్యారు. ఈ ఏడాది నవంబర్ నుంచి విపక్ష నేత నవీన్ పట్నాయక్ రాష్ట్రవ్యాప్తంగా పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలవారీగా నాయకులతో తరచూ సమావేశమవుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సంస్థాగత వ్యవస్థని బలోపేతం చేయడం లక్ష్యంగా పర్యటనకు నడుం బిగించడం విశేషం.

సంక్షేమానికి సిగ్నల్ పాట్లు..!



కొండపై ఆధార్ కార్డులతో మహిళలు



సేవ కేంద్రంలో ల్యాప్‌టాప్‌లతో పనులు చేస్తున్న సిబ్బంది

మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి స్వాభిమాన్ ఏరియా రల్లేగడ పంచాయతీ బనజోలి గ్రామం వద్ద కొండపైకి సుభద్ర యోజన దరఖాస్తుదారులు బారులుతీరుతున్నారు. సుభద్ర యోజన కోసం మహిళలు చిత్రకొండ సమితి కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. దీంతో గ్రామం వద్ద తాత్కాలికంగా ఒక సేవ కేంద్రం ఏర్పాటు చేశారు. అయితే అక్కడ సరైన నెట్‌వర్క్ లేకపోవడంతో నెట్‌వర్క్ వచ్చే బనజోలి గ్రామం కొండపైన టెంట్ వేసి సుభద్ర యోజన పనులు చేస్తున్నారు. దీంతో ఈ సేవ కేంద్రానికి చేరుకోవాలంటే అడవి మార్గంలో ప్రజలు కొండపైకి వెళ్తున్నారు. దాదాపు 20 గ్రామాల ప్రజలకు ఈ కేంద్రమే ఆధారం.

– మల్కన్‌గిరి



అడవి మార్గంలో కొండపైకి వెళ్తున్న గిరిజనులు



కొండపై ఏర్పాటు చేసిన సేవ కేంద్రం

నేటి నుంచి లేజర్ స్కానింగ్

- సర్వ దర్శనానికి స్వల్ప అంతరాయం
- మహా ప్రసాదాల లభ్యత యథాతథం



భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథుని రత్న భాండాగారం నిర్వహణ ప్రక్రియ అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కొనసాగుతోంది. దీనిలో భాగంగా శనివారం నుంచి వైజ్ఞానిక పద్ధతిలో సర్వే నిర్వహించేందుకు సన్నద్ధమయ్యారు. ఇంతకుముందు బుధవారం తొలి విడత పనులు ముగించారు. ఈ నివేదిక ఆధారంగా రాడార్ స్కానింగ్ వంటి అధునాతన మాధ్యమాల్లో రత్న భాండాగారం సమగ్ర స్థితిగతులను సర్వే చేయాలని నిర్ణయించారు. ఈ నిర్ణయం మేరకు నేటి నుంచి మలి విడత సర్వే పనులు చేపట్టనున్నారు. ఈ పనులను 3 రోజులపాటు నిరవధికంగా నిర్వహిస్తారు. ఈ లెక్కన ఈనెల 23తో మలి విడత రత్న భాండాగారం సర్వే పనులు ముగుస్తాయి. నిత్యం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిరవధికంగా ఈ పనులు కొనసాగిస్తారు. రత్న వేదికపై కొలువుదీరిన స్వామి దైనందిన సేవాదులకు ఎటువంటి అంతరాయం లేకుండా సర్వే పనులు కొనసాగించాలని నిర్ణయించారు. పనులు కొనసాగుతున్న నిడివిలో సాధారణ భక్తులకు స్వామి సర్వ దర్శనం నిలిపి వేయనున్నట్లు శ్రీ మందిరం దేవస్థానం అధికార వర్గాలు ప్రకటించాయి.

మహా ప్రసాదాలు లభ్యం

ఔత్సాహిక భక్తులు, యాత్రికులకు స్వామికి నివేదించిన అన్న ప్రసాదాలు యథాతథంగా లభిస్తాయి. ఈ మేరకు శ్రీమందిరం సింహద్వారం 22 మెట్ల గుండా ఆనంద బజార్ ప్రాంగణానికి వెళ్లేందుకు మార్గం తెరిచి ఉంచుతారు. మహా ప్రసాదాలు కొనుగోలు తర్వాత ఉత్తర ద్వారం గుండా వెలుపలకు వెళ్లేందుకు ఏర్పాటు చేశారు.

సకాలంలో సర్వే ముగింపు

శ్రీమందిర రత్న భాండాగారం సర్వే కార్యకలాపాలు సకాలంలో పూర్తి చేయాలని భారత పురావస్తు శాఖ(ఏఎస్ఐ) డైరెక్టర్ జనరల్‌కు లేఖ రాసినట్లు శ్రీ మందిరం ప్రధాన పాలన అధికారి(సీఏఓ) డాక్టర్ అరవింద కుమార్ పాఢి తెలిపారు. ఈనెల 24వ తేదీ నాటికి రత్న భాండాగారం సర్వేకి సంబంధించిన సాంకేతిక సర్వే ప్రక్రియ ముగించాలని అభ్యర్థించినట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం రత్న భాండాగారం నిర్వహణ, మరమత్తులు ఇతరేతర అనుబంధ కార్యకలాపాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

దసరా షోల పూజలు

ఏటా దసరా పురస్కరించుకుని శ్రీమందిరంలో షోల పూజ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈనెల 24వ తేదీ నుంచి ఈ పూజలు ప్రారంభం కానున్నాయి. ఈ పూజాదులకు అంతరాయం లేకుండా సర్వే పనులు ముగించేందుకు కార్యాచరణ ఖరారు చేశారు. ఈ పనులు పూర్తి కావడంతో తుది నివేదిక రూపురేఖలు దిద్దుకుంటుందన్నారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్టు



గంజాయితో పట్టుబడిన నిందితులతో ఎస్ఐ మల్లేశ్వరరావు, తదితరులు

- పరారీలో మరో ఇద్దరు వ్యక్తులు
- కారు, 64 కేజీల గంజాయి స్వాధీనం

దేవరాపల్లి (అనకాపల్లి జిల్లా): ఏజెన్సీ నుంచి కారులో అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముగ్గురు నిందితులను ఎస్ఐ టి.మల్లేశ్వరరావు పట్టుకున్నారు. దేవరాపల్లి మీదుగా గంజాయి అక్రమంగా తరలిస్తున్నట్లు ముందస్తు సమాచారం మేరకు గురువారం సాయంత్రం శ్రీరాంపురం వై జంక్షన్ వద్ద ఎస్ఐ తన సిబ్బంది కలిసి కాపు కాశారు. కారులో తరలిస్తున్న 64 కిలోల గంజాయితో పాటు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ వెల్లడించిన వివరాల ప్రకారం.. గంజాయితో పట్టుబడిన వారిలో ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా పనసపుట్టు పంచాయతీ శివారు జామిగుడ గ్రామానికి చెందిన కొర్రా రంజు, కొర్రా అర్జున్‌తో పాటు పెదబయలకు చెందిన కారు డ్రైవర్ కూడ కార్తీక్ ఉన్నారు. వీరి ముగ్గురిని అరెస్టు చేసి చోడవరం కోర్టుకు తరలించారు. పట్టుబడిన వారిలో రంజు, అర్జున్ గంజాయి పండిస్తున్నారు. వారి దగ్గర నుంచి కారు యజమానులైన ఒడిశాకు చెందిన గంజా గోపి, హుకుంపేట మండలం గన్నెలపూట్‌కు చెందిన కొర్ర శివ కలిసి కొనుగోలు చేసిన 64 కేజీల గంజాయితో కారులో నలుగురు బయలుదేరారు. పెదబయలుకు రాగానే కారు యజమానులు ఇద్దరూ కారును అదే గ్రామానికి చెందిన కూడ కార్తీక్‌కు అప్పగించారు.

కారులో గంజాయిని దేవరాపల్లి మీదుగా విశాఖ ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరుకుంటే, అక్కడికి తామిద్దరం వస్తామని చెప్పి కారు యజమానులు ఇద్దరు దిగిపోయారు. దీనిపై పక్కా సమాచారంతో శ్రీరాంపురం వై జంక్షన్ వద్ద స్థానిక పోలీస్‌లు మాటు వేసి పట్టుకున్నారు. కారు యజమానులు ఇద్దరు పరారీలో ఉన్నారని, కారును సీజ్ చేసి, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

భవన కార్మికులకు చెక్కులు అందజేత



చెక్కులు అందజేస్తున్న కలెక్టర్ బిజయకుమార్ దాస్

పర్లాకిమిడి: జిల్లా కార్మిక ఉపాధి, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో భవన కార్మికుల లబ్ధిదారులకు నిర్మాణ శ్రామిక కల్యాణ పథకం కింద చెక్కులను కలెక్టర్ బిజయకుమార్ దాస్ శుక్రవారం అందజేశారు. నిర్మాణ శ్రామిక కల్యాణ పథకం కింద 403 మందికి ఆర్థిక సాయం అందజేశారు. అలాగే మృతి చెందిన భవన కార్మికులకు ఇన్సురెన్సు కింద 80 మందికి రూ.1.59 కోట్లు, 78 మంది కార్మికులకు అంత్యక్రియల సాయంగా రూ.3.90 లక్షలు, కల్యాణ యోజన పథకం కింద రూ.1.22 కోట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్మిక అధికారి భారతీ బెహరా, డీపీఆర్‌వో ప్రదీప్త గురుమయి తదితరులు పాల్గొన్నారు.

మావో పోస్టర్ల కలకలం



హనుమంతపూర్ వద్ద చెట్టుకు అతికించిన పోస్టర్



మావో బ్యానర్

రాయగడ: జిల్లాలోని చంద్రపూర్ సమితి హనుమంతపూర్‌లో మావోయిస్టుల బ్యానర్లు, పోస్టర్లు కలకలం సృష్టించాయి. హనుమంతపూర్ నుంచి పంఖాలుగుడ వరకు ఉన్న రహదారిలో వీటిని ఏర్పాటు చేశారు. బఘున డివిజన్ సీపీఐ(ఎంఎల్) మావోయిస్టుల పేరుతో కనిపించిన ఈ బ్యానర్లు, పోస్టర్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని నిలదీస్తూ ఎండగట్టారు. ఏళ్ల గడిచినా ఇప్పటికీ గ్రామాల్లోని ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యాయని ధ్వజమెత్తారు. మహిళల ఆర్థిక ప్రగతికి ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని, విద్య, వైద్య రంగాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయని ఆరోపించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆయా ప్రాంతాలకు వెళ్లి బ్యానర్లు, పోస్టర్లను స్వాధీనం చేసుకున్నారు.

విజిలెన్స్ దాడులు



ఎస్.వి.హరిహరరావు



సోదాల్లో బయటపడిన నగదు

భువనేశ్వర్: బాలాసోర్ గ్రామీణ నిర్మాణ శాఖ చీఫ్ ఇంజినీర్ ఎస్.వి. హరిహరరావు ఇంటిపై శుక్రవారం విజిలెన్సు దాడులు చేపట్టారు. భువనేశ్వర్, బరంపురం తదితర 11 ప్రాంతాల్లో ఒకేసారి దాడులు కొనసాగిస్తున్నారు. భువనేశ్వర్ ప్రత్యేక విజిలెన్సు కోర్టు న్యాయమూర్తి ఆదేశాల మేరకు సోదాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. 11 మంది డీఎస్పీలు, 7 మంది ఇన్‌స్పెక్టర్లు 11 మంది సహాయ సబ్ ఇన్‌స్పెక్టర్లు ఇతర సహాయక సిబ్బందితో పలుచోట్ల ఏకకాలంలో సోదాలు కొనసాగిస్తున్నారు. దీనిలో భాగంగా లెక్కకు మిక్కిలిగా నగదు, బంగారం, భవనాలు, ఇండ్ల స్థలాలు, పొదుపు ఖాతాల్లో భారీ మొత్తం నిధులు బయటపడ్డాయి. నిందితుడి బావగారి ఇంటి నుంచి రూ.46.45 లక్షల నగదు స్వాధీనపరచుకున్నారు. 2 భవనాలు, 3 బీహెచ్‌కే ఫ్లాటు, భువనేశ్వర్, బరంపురం ప్రాంతాల్లో 2 అనుమానాస్పద బినామీ ఫ్లాట్లు, 4 ఇండ్ల స్థలాలు, రూ.2.10 కోట్ల డిపాజిట్లు, స్టాక్ మార్కెట్‌లో రూ.1.32 కోట్లు, 510 గ్రాముల బంగారం సోదాల్లో బయటపడినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు.

సంక్షిప్తంగా..

నష్ట పరిహారం చెల్లించాలి

రాయగడ: కల్యాణ సింగుపూర్ సమితి సెరిగుమ్మ పంచాయతీలోని లంబేరి గ్రామంలో డయేరియాతో మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని బిసంకటక్ ఎమ్మెల్యే నీలమాధవ హికక డిమాండ్ చేశారు. లంబేరిలో శుక్రవారం పర్యటించిన ఆయన అక్కడ పరిస్థితిని సమీక్షించారు. గ్రామస్తులతో కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డయేరియాతో మృతి చెందిన బాధిత కుటుంబాలను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామమైన లంబేరిలో మౌలిక సౌకర్యాలు అంతంతమాత్రంగానే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సత్వరంగా స్పందించి గ్రామాల్లో కనీస మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరారు.

దంత వైద్య శిబిరం



విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రాయగడ: స్థానిక గాంధీనగర్ ప్రాథమిక పాఠశాలలో మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం శుక్రవారం జరిగింది. పాఠశాలలోని 100 మంది విద్యార్థులకు దంత పరీక్షలను నిర్వహించారు. స్థానిక శ్రీ మల్టీ స్పెషాలిటీ డెంటల్ క్లీనిక్‌కు చెందిన దంతవైద్య నిపుణులు డాక్టర్ అలేఖ్యా పెద్దిన, డాక్టర్ సుభశ్రీ పండలు విద్యార్థులకు దంత పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు కోరాడ రజిత, సాధారణ కార్యదర్శి కె.భారతీ, సభ్యులు పాల్గొన్నారు.

మావో డంప్ స్వాధీనం



మావోయిస్టులు అమర్చిన డంప్

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి బెజాంగ్‌వాడ పంచాయతీ గంపకొండ కెనాల్ దిగువ భాగంలో శుక్రవారం ఉదయం 142 బెటాలియన్‌కు చెందిన బీఎస్ఎఫ్ జవాన్లు మావోయిస్టులు అమర్చిన డంప్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కెనాల్ ప్రాంతంలో డంప్ ఉన్నట్లు బీఎస్ఎఫ్ జవాన్లుకు గురువారం ముందస్తు సమాచారం వచ్చింది. దీంతో జవాన్లు గురువారం రాత్రి నుంచి కూంబింగ్ ప్రారంభించారు. బెజాంగ్‌వాడ అడవిలో జల్లేడ పడుతుండగా శుక్రవారం ఉదయం డంప్ ఉన్న ప్రదేశం తారసపడింది. డంప్‌లో కేజీన్నర టిఫిన్ బాంబ్, ఒక ఎలక్ట్రిక్ డిటోనేటర్, 30 మీటర్ల పొడవు ఉన్న కరెంట్ వైరును స్వాధీనం చేసుకున్నారు. దీంతో కూంబింగ్ ముమ్మరం చేశారు.

స్వచ్ఛ భారత్



స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది

పర్లాకిమిడి: పట్టణంలోని కలెక్టరేట్ ఆవరణలో అధికారులు స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. డీఆర్‌డీఏ, జిల్లా పరిషత్, సబ్ కలెక్టర్ కార్యాలయం, ఆర్‌శెట్టి భవనం వద్ద చెత్తను తొలగించారు. కార్యక్రమంలో అదనపు జిల్లా మాజిస్ట్రేట్ రాజేంద్ర మింజ్, డీఆర్‌డీఏ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గుణనిధినాయక్, సబ్ కలెక్టర్ అనూప్ పండా, డిప్యూటీ కలెక్టర్ ప్రాణకృష్ణ పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పూరిల్లు దగ్ధం



కాలిపోతున్న పూరిల్లు

గుర్ల: మండలంలోని కోటగండ్రేడు గ్రామానికి చెందిన మరడాన సూర్యనారాయణ పూరిల్లు శుక్రవారం తెల్లవారుజామున దగ్ధమైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం జరిగి ఉంటుందని బాధిత కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఈ అగ్ని ప్రమాదం వల్ల సుమారు రూ.60 వేల ఆస్తినష్టం జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. దగ్ధమైన పూరింటిని రెవెన్యూ అధికారులు పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు.

20 లీటర్ల సారా స్వాధీనం

సీతంపేట: అక్రమంగా తరలిస్తున్న 20 లీటర్ల సారాను పట్టుకున్నట్టు ఎస్సై ఎం.జగదీష్‌నాయుడు తెలిపారు. సీతంపేట మండలంలోని దిగువబుడగరాయి గ్రామ సందర్శనకు వెళ్లిన సమయంలో సవర సుంబురు అనే వ్యక్తి సారా తరలిస్తుండగా గుర్తించి పట్టుకుని అరెస్టు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

58 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్ట్

సీతానగరం: మండలంలో అక్రమంగా మద్యం విక్రయాలు చేస్తున్న నిర్వాహకులపై దాడులు నిర్వహించడంతో పాటు వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు ఎస్సై ఎం.రాజేష్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మండలంలోని రామవరంలో ఒక షాపులో 58 మద్యం సీసాలను అక్రమంగా నిల్వ ఉంచినట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా అనధికారికంగా మద్య విక్రయాలు సాగిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సోదాల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జి.అప్పారావు(21)మృతి చెందినట్లు పెదమానాపురం ఎస్సై జయంతి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె తెలిపిన వివరాల ప్రకారం అప్పారావు మొరకముడిదాం నుంచి పెదమానాపురం బైక్‌పై వస్తుండగా వంగర గ్రామనికి చెందిన కుమార్‌నాయుడు గజపతినగరం నుంచి స్వగ్రామం బైక్‌పై వెళ్తుండగా రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ప్రమాదం జరిగి అప్పారావు తీవ్ర గాయాల పాలయ్యాడు. దీంతో అప్పారావును విజయనగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

అభినందన



దేవిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పద్మలత, తదితరులు

నెల్లిమర్ల రూరల్: ఇటీవల జిల్లా స్థాయిలో నిర్వహించిన త్రోబాల్ ఎంపిక పోటీల్లో మండలంలోని సతివాడ ఆదర్శ పాఠశాల విద్యార్థిని దేవి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. దీంతో దేవిని పాఠశాల ప్రిన్సిపాల్ పద్మలత, సిబ్బంది శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, విశాఖలోని మున్సిపల్ స్టేడియంలో శనివారం నుంచి రెండు రోజుల పాటు జరగనున్న రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్ పోటీల్లో దేవి పాల్గొంటుందన్నారు. కార్యక్రమంలో పీఈటీ స్వాతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ఆటోల పట్టివేత



ఇసుకతో పట్టుబడిన ఆటో

నెల్లిమర్ల: పట్టణ పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ఆటోలను రెవెన్యూ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. స్థానిక చంపావతి నది నుంచి ఇసుక తరలిస్తున్న వీటిని మిమ్స్ ఆస్పత్రి సమీపంలో వీఆర్‌ఓలు పట్టుకుని తహసీల్దార్ సుదర్శనరావుకు అప్పగించారు. ఆయన ఒక్కో ఆటోకు రూ.2 వేలు చొప్పున అపరాధ రుసుం విధించారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు.

మానవతా మూర్తి మన గురజాడ

- నేడు మహాకవి 162వ జయంతి
- వేడుకల్లో పాల్గొననున్న రాష్ట్ర ప్రజాప్రతినిధులు, అధికారులు
- కలెక్టరేట్ ఆడిటోరియంలో సభ, సాంస్కృతిక కార్యక్రమాలు

మనిషిని ప్రేమించడమే తన మతంగా చెప్పుకున్న మానవతా మూర్తి గురజాడ వేంకట అప్పారావు. 'బతికి చచ్చియు ప్రజలకు ఎవడు ప్రీతి చేకూర్చునో వాడే ధన్యుడు' అంటూ మానవత్వాన్ని వినిపించిన మహాకవి గురజాడ వేంకట అప్పారావు. ఆయన విజయనగర ఖ్యాతిని దశదిశలా ఇనుమడించారు. విద్యలనగరమైన విజయనగరంలో సాహితీ సౌరభాలను కురిపించారు. ఆధునిక ఆంధ్ర సాహిత్యంలో వేగుచుక్కలా మెరిశారు. వందల ఏళ్లు దాటినా ఆయన అజరామరుడే. 'ఆకులందున అణిగీమణిగీ కవిత కోయిల పలకవలెనోయి' అంటూ ప్రజల కోసం ప్రజల భాషలోనే రాయాలని తలచిన సామాజిక విప్లవమూర్తి గురజాడ అప్పారావు. ఆయన రచనలన్నీ వేటికవే ఆణిముత్యాలు. గురజాడ రచనలన్నీ మాసిపోయినా ఒక్క దేశభక్తి గీతం 'దేశమంటే మట్టికాదోయి' మిగిలినా చాలు ప్రపంచ కవుల్లో గురజాడ ఒకరని రుజువు చేయడానికి సాక్ష్యమని శ్రీశ్రీ వంటి మహాకవి గురజాడను కొనియాడారు. గురజాడ రచనల్లో ఒక్కోటి ఒక్కో సమస్యను చర్చిస్తుంది.



గురజాడ వేంకట అప్పారావు



గురజాడ గృహం

విజయనగరం టౌన్:

సాహితీవేత్త గురజాడ నడయాడిన నేలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో గురజాడ 162వ జయంతి ఉత్సవాన్ని శనివారం అధికారికంగా నిర్వహించనున్నాయి. ఉదయం 9 గంటలకు మహాకవి స్వగృహంలో ఆయన చిత్రపటం వద్ద జ్యోతిప్రజ్వలన, విగ్రహానికి ప్రముఖులు పూలమాలాలంకరణ చేస్తారు. 9.30 గంటలకు గురజాడ కూడలి వద్ద ఉన్న గురజాడ కాంస్య విగ్రహానికి పూలమాలాలంకరణ కార్యక్రమం ఉంటుంది. అనంతరం 10 గంటల నుంచి కలెక్టరేట్‌లో ఉన్న ఆడిటోరియంలో సభా కార్యక్రమం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. 11 గంటలకు ప్రముఖుల సందేశాలు, 11.45 గంటలకు ప్రముఖ సాహితీవేత్తలు, కళాకారులు, గురజాడ వంశీయులకు సన్మాన కార్యక్రమాలు, 12 గంటలకు వందన సమర్పణ ఉంటాయి.

గురజాడ ప్రస్థానం..

సామాజిక సమస్యలపై సాహితీ సమరం పూరించి, విశ్వ సాహితీ వినీలాకాశంలో తెలుగు వెలుగులు విరజిమ్మిన సాహితీ సౌరభం మన మహాకవి గురజాడ వేంకట అప్పారావు. గురజాడ అప్పారావు 1862 సెప్టెంబరు 21న రాయవరంలో జన్మించారు. మహారాజా విద్యాసంస్థల్లో గిడుగు సహ విద్యార్థిగా మెట్రిక్యులేషన్ పూర్తిచేశారు. ఆయన 23వ ఏట అప్పలనరసమ్మతో వివాహం జరిగింది. ఆయనకు వెంకట రామదాసు, కొండయమ్మలు సంతానం. సమాజంలోని రుగ్మతలను రూపుమాపేందుకు కన్యాశుల్కం పేరుతో 1892 ఆగస్టు 13న తొలికూర్పును గురజాడ ప్రదర్శించారు. 1897లో ఆనందగజపతికి అంకితం ఇచ్చారు. రెండో కూర్పును 1909లో ప్రచురించారు. అప్పట్లో సంస్కృత భాషకు ఆదరణ ఎక్కువగా ఉండేది. ముత్యాలసరాలు రచించి సామాన్యునికి అర్థమయ్యే విధంగా అందజేశారు. 1883లో సారంగధర, డామిట్ కథ అడ్డం తిరిగింది, పుత్తడి బొమ్మ పూర్ణమ్మ, లవణరాజు కల, నీలగిరి పాటలు, కాసులు, బిల్హణీయం, కన్యక, సుభద్ర, దించు, లంగరు, తదితర ఎన్నో అద్భుతమైన రచనలు గురజాడ కలం నుంచి జాలువారాయి. అన్నింటికన్నా ముఖ్యమంగా 'దేశమును ప్రేమించుమన్నా' అంటూ దేశభక్తి గేయం రాసి విమర్శకుల ప్రసంసలు పొందారు. రాజా వారి కోర్టు దావాలలో ఎడతెరిపి లేకుండా ఆ భారాన్నంతా తన భుజాన్ని వేసుకుని పనులు చేశారు. అప్పటికే ఆయన ఆరోగ్యం బాగా క్షీణించింది. 1915 నవంబరు 30న ఉదయం 8.20 గంటలకు ఆ మహనీయుడు పరమపదించారు.



గురజాడ వాడిన స్టాంప్, కళ్లద్దాలు



గృహం లోపల గురజాడ అప్పారావు విగ్రహం



గురజాడ చరిత్రకు సంబంధించిన ఎగ్జిబిషన్



గురజాడ వాడిన పుస్తకం



ముఖద్వారం వద్ద గురజాడ చిత్రపటం



మహాకవి సమకాలీన మేధావుల చిత్రపటాలు



గురజాడ గేయాలతో బోర్డు





గురజాడ జ్ఞాపకాలు

ఆకట్టుకున్న గురజాడ చిత్రరూపం

మహాకవి గురజాడ వెంకట అప్పారావు రచించిన కన్యాశుల్కంలోని పాత్రధారులతో జిల్లాకు చెందిన ప్రముఖ చిత్రకారిణి, లిమ్కాబుక్ ఆఫ్ రికార్డ్స్‌హోల్డర్ సిరిపురపు ప్రవల్లిక నారాయణ్ వేసిన చిత్రం అందరినీ ఆకట్టుకుంటోంది.

పేదల బియ్యం పట్టివేత



అక్రమంగా తరలిపోతున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్న రెవెన్యూ, విజిలెన్స్ అధికారులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి పట్టణంలో అక్రమంగా తరలిపోతున్న రేషన్ బియ్యం పెద్ద ఎత్తున పట్టుబడ్డాయి. ప్రజాపంపిణీ వ్యవస్థలో పేద, మధ్య తరగతి ప్రజల కోసం రేషన్ డిపోల ద్వారా పంపిణీ కావాల్సిన బియ్యం అక్రమంగా తరలిపోతుండగా గరివిడి రెవెన్యూ, విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా దాడిచేసి 6,742 కిలోల బియ్యాన్ని పట్టుకున్నారు. గుర్ల మండలంలోని చోడవరం గ్రామంలో బి.వెంకటరమణ అనే వ్యక్తి ఈ రేషన్ బియ్యాన్ని సేకరించాడు. ఈ రేషన్ బియ్యాన్ని తరలించేందుకు ఒడిశా నుంచి ఓ లారీని తీసుకువచ్చి లోడ్ చేయించాడు. ఈ నేపథ్యంలో బియ్యాన్ని తరలిస్తూ గరివిడిలో గల అన్నపూర్ణ వేబ్రిడ్జి వద్ద బరువు తూయించే క్రమంలో విజిలెన్స్ ఎస్సై రామారావు, గరివిడి సీఎస్‌డీటీ శోభ సంయుక్తంగా దాడి చేసి పట్టుకున్నారు. సీఎస్‌డీటీ శోభ మాట్లాడుతూ పట్టుబడిన 67 క్వింటాళ్ల 42 కిలోల బియ్యాన్ని చీపురుపల్లి ఎంఎల్‌ఎస్ గొడౌన్‌కు తరలించామని, వాహనాన్ని సీజ్‌చేసి గరివిడి పోలీస్‌స్టేషన్‌కు అప్పగించామని తెలిపారు.

పశువులు తరలిస్తున్న బొలెరో వాహనాల పట్టివేత



పట్టుకున్న బొలెరో వాహనాలను చూపిస్తున్న ఎస్సై వెంకట సురేష్

పాచిపెంట: పశువులను వాహనంలో కిక్కిరిసినట్లు ఎక్కించి అక్రమంగా తరలిస్తున్న మూడు బొలెరో వాహనాలను పట్టుకున్నట్లు ఎస్సై వెంకటసురేష్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ, మండలంలోని పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు చేపడుతుండగా ఒడిశా రాష్ట్రం నుంచి మానాపురం సంతకు పశువులను తరలిస్తున్న బొలెరో వాహనాలను పట్టుకున్నామన్నారు. వాటిని రవాణా చేసేందుకు వారి వద్ద లైసెన్సులు లేవని, యానిమల్ ట్రాన్స్‌పోర్టేషన్ రూల్స్ పాటించని సదరు వాహనదారులు, వాహనచోదకులపై కేసులు నమోదు చేసి, వాహనాలు సీజ్ చేశామని తెలిపారు.

లింగ నిర్ధారణకు పాల్పడితే క్రిమినల్ కేసులు

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్. భాస్కరరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: లింగ నిర్ధారణకు పాల్పడే స్కానింగ్ సెంటర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్. భాస్కరరావు స్పష్టం చేశారు. ఈ మేరకు స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శుక్రవారం గర్భధారణ పూర్వ, గర్భస్థ పిండ పక్రియ చట్టం 1994 అమలుపై నియమించిన జిల్లా స్థాయి అడ్వయజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ గర్భస్థ పిండ పరిస్థితి, వ్యాధుల గుర్తింపు తదితర పరీక్షలకు వినియోగించవలసిన యంత్రాలను లింగ నిర్ధారణకు ఉపయోగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రోగ్రాం అధికారులు విధిగా స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేయాలని ఆదేశించారు. సరోగసీ రెగ్యులేషన్ చట్టం 2021 ప్రకారం జిల్లాలో ఫెర్టిలిటీ కేంద్రాలు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వ్యాధి నిరోధక టీకా అధికారి డాక్టర్ అచ్యుతకుమారి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎన్. సూర్యనారాయణ, గైనకాలజిస్టు డాక్టర్ ఉమామహేశ్వరి, పిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ సుజాత దేవి తదితరులు పాల్గొన్నారు.

వరదబాధితులకు మేముసైతం

- పలు పాఠశాలల విద్యార్థుల విరాళం
- కలెక్టర్‌కు చెక్కుల అందజేత



పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల నుంచి చెక్కులను అందుకుంటున్న కలెక్టర్ బీఆర్ అంబేద్కర్

విజయనగరం అర్బన్: జిల్లాలోని పలు పాఠశాలల విద్యార్థులు వరద బాధితుల సహాయానికి సిద్ధంగా ఉన్నామంటూ తమకు తోచిన సహాయాన్ని అందిస్తున్నారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం సేకరించిన విరాళాల మొత్తాన్ని పలు పాఠశాలల విద్యార్థులు శుక్రవారం కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్‌కు కలెక్టరేట్‌లో అందజేశారు. గంట్యాడ మండలం లక్కిడాం గ్రామానికి చెందిన జెడ్పీ హైస్కూల్ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కలిసి వరద బాధితుల సహాయార్థం రూ.14,091 అందజేశారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమకుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులతో కలిసి ఈ మేరకు చెక్కును కలెక్టర్‌కు అందించారు. అదే విధంగా జామి మండలం విజినిగిరి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు వరద బాధితుల సహాయార్థం సేకరించిన విరాళాల మొత్తం రూ.10,890 కలెక్టర్‌కు కలెక్టరేట్‌లో అందించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో పాఠశాల హెచ్‌ఎం కె.వెంకటరావు, ఈశ్వరరావు, పీవీకృష్ణారావు తదితరులు ఉన్నారు.

గిరిజనం అంటే అలుసా?

- విద్యాసంస్థల్లో హెల్త్ వలంటీర్ నియామకం లేదా?
- కానరాని నాల్గో తరగతి సిబ్బంది నియామకం
- ప్రారంభం కాని డీఎస్‌సీ కోచింగ్
- ఐటీడీఏ పీఓను నియమించేదెప్పుడు?



హెల్త్ వలంటీర్‌లను నియమించాలని వినతి ఇస్తున్న గిరిజన సంఘాల నాయకులు

సీతంపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వందరోజులైంది. అయినా గిరిజన ప్రాంతాల్లో సమస్యల పరిష్కారానికి ఇచ్చిన హామీలు నెరవేరలేదు. ముఖ్యంగా గిరిజన విద్యాసంస్థల్లో హెల్త్ వలంటీర్‌లను, నాల్గోతరగతి సిబ్బందిని నియమిస్తామని గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత స్వయంగా ప్రకటించారు. అయితే ఇంతవరకు ఆ హామీ నెరవేరలేదు. సీతంపేట ఐటీడీఏ పరిధిలో 47 ఆశ్రమపాఠశాలలు, మరో 18 పోస్టుమెట్రిక్ వసతిగృహాలు ఉన్నాయి. వాటిలో దాదాపు 16 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. గిరిజన విద్యార్థులు జ్వరాలు, ఇతర వ్యాధుల బారిన పడితే హెల్త్ వలంటీర్లు ప్రథమ చికిత్స చేసి ఆస్పత్రికి తీసుకువెళ్లాలి. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ప్రతిరోజూ ఏరియా ఆస్పత్రితో పాటు, మిగతా పీహెచ్‌సీలకు విద్యార్థులను ఉపాధ్యాయ సిబ్బంది తరలించే పరిస్థితి ఉంది. కనీసం ప్రథమ చికిత్స చేసిన వారు కూడా లేక అవస్థలు పడాల్సి వస్తోంది.

నాల్గో తరగతి సిబ్బంది లేక అవస్థలు

నాల్గో తరగతి సిబ్బంది సైతం ఏ ఆశ్రమ పాఠశాలలో చూసినా లేరు. కొన్ని పాఠశాలల్లో రోజువారీ వేతన ప్రాతిపదికన వంటవారిని, కూరగాయలు కోసేవారిని, ఇతర పనివారిని పాఠశాల యాజమాన్యమే తెప్పించుకుని విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేస్తోంది. కొన్ని పాఠశాలల్లో 500కు మించి విద్యార్థులు ఉన్నారు. వారికి మూడు పూటలా వండి వడ్డించడం కష్టసాధ్యమైన పని. ఈ తరుణంలో వంటవారిని, వారికి సహాయకులను నియమిస్తే సమస్యలు కొంతమేర పరిష్కారమవుతాయి. ఈ సమస్యలపై గిరిజన మంత్రికి గిరిజన సంఘాల నాయకులు వినతిపత్రాలు సమర్పించారు. త్వరితగతిన హెల్త్‌వలంటీర్‌లను నియమిస్తామని, నాల్గో తరగతి సిబ్బందిని కూడా నియమించడానికి చర్యలు తీసుకుంటామని గిరిజన మంత్రి హామీ ఇచ్చినా ఇంతవరకు అతీగతీ లేదు.



గత నెలలో డీఎస్సీ కోచింగ్‌కు ప్రవేశపరీక్ష రాసిన నిరుద్యోగులు

డీఎస్సీ కోచింగ్ ఎప్పుడు?

గిరిజన అభ్యర్థులకు ఉచితంగా డీఎస్సీ కోచింగ్ ఇప్పిస్తామని స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. ఈ మేరకు అధికారులు ఉచిత కోచింగ్ ప్రవేశ పరీక్ష సైతం నిర్వహించారు. 200మంది వరకు ఎంపిక చేసి ఉచిత కోచింగ్ స్థానిక వైటీసీలో ఇప్పించడానికి ప్రణాళికలు రూపొందించారు. కానీ ప్రత్యేక డీఎస్సీ కోచింగ్ ఇంతవరకు ప్రారంభించలేదు.

ఐటీడీఏకు పీఓ నియామకమెప్పుడు?

స్థానిక ఐటీడీఏకు ఇంతవరకు పీఓను నియమించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఐఏఎస్‌ల బదిలీల్లో సీతంపేట ఐటీడీఏకు ఒక ఐఏఎస్ ఆఫీసర్‌ను పీఓగా నియమించి కేవలం పక్షం రోజుల్లోనే బదిలీచేశారు. అటు తర్వాత మరో పీఓను నియమించకుండా పాలకొండ సబ్‌కలెక్టర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పట్లో పీఓను ప్రత్యేకంగా నియమించే పరిస్థితులు కనిపించడం లేదు.

హామీల అమలులో వైఫల్యం



హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందింది. వంద రోజుల పాలనలో ఏం చేశారో వారికే తెలియాలి. గిరిజన విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ఆరోగ్య వలంటీర్‌లను వెంటనే నియమిస్తామని ప్రకటించిన మంత్రి ఇంతవరకు ఆ ఊసే ఎత్తడం లేదు. కనీసం పీఓను కూడా ఐటీడీఏకు నియమించకపోవడం చూస్తుంటే కూటమి పాలన ఎలా ఉందో ఇట్టే అవగతమవుతోంది. – విశ్వాసరాయి కళావతి, పాలకొండ మాజీ ఎమ్మెల్యే

పౌష్టికాహారం తప్పనిసరి

- ఎంపీడీఓ రాధిక



మత్స్యవానిపాలెంలో సామూహిక సీమంతం చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు

పూసపాటిరేగ : గర్భిణులు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని ఎంపీడీఓ ఎం. రాధిక అన్నారు. మండలంలోని మత్స్యవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సామూహిక సీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆరోగ్య కార్యకర్తలు అందించిన సూచనలు, సలహాలను గర్భిణులు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సత్యవతి, కార్యకర్త ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో ద్వారపూడి

విజయనగరం రూరల్: మండలంలోని ద్వారపూడి ప్రజలు గడిచిన పన్నెండు గంటల నుంచి చీకట్లోనే మగ్గుతున్నారు. ద్వారపూడిలో గడిచిన కొన్ని నెలలుగా జేఎల్‌ఎం పోస్టు ఖాళీగా ఉంది. దీంతో ఎప్పటికప్పుడు విద్యుత్ సమస్యలు తలెత్తడంతో ప్రజలు అంధకారంలో గడపాల్సి వస్తోంది. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 వరకు సరఫరా లేదు. గ్రామానికి జూనియర్ లైన్‌మెన్ పోస్టు కేటాయించడంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ మార్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.